క్లుప్తంగా

వీధిలైట్ల ఏర్పాటు



శంషాబాద్: పట్టణంలోని 14వ వార్డులో శనివారం మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్ దగ్గరుండి వీధిలైట్లు ఏర్పాటు చేయించారు. పట్టణ పరిధిలోని మౌలిక సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామన్నారు. వార్డులో అనేక సమస్యల పరిష్కారానికి సొంత నిధులు సైతం ఖర్చు చేసినట్లు వైస్‌చైర్మన్ వివరించారు.

మణికొండలో ఎగ్జిబిషన్ ప్రారంభం



హ్యాండ్ బ్యాగులు, పర్సులను కొనుగోలు చేస్తున్న ప్రజలు

మణికొండ: దేశ వ్యాప్తంగా చేతి వృత్తుల వారు తయారు చేసిన దుస్తులు, గృహోపకరణ వస్తువుల ఎగ్జిబిషన్ మణికొండ పైప్‌లైన్ రోడ్డులో సుందర్ గార్డన్ ఫంక్షన్ హాల్ పక్కన శనివారం ప్రారంభమైంది. ఇందులో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైన ర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ లెనిన్, కలంకారి, బెంగాల్ కాటన్ చీరలతో పాటు డ్రస్ మెటీరియల్, డిజైనర్ బ్లౌస్‌లు, ఖాదీ మెటీరియల్, వన్ గ్రాం గోల్డ్ జ్యువలరీ, జైపూర్ బెడ్‌షీట్, కొండపల్లి బొమ్మలు, పర్సులు, గృహోపకరణ వస్తువులు అందుబాటులో ఉన్నాయి.

క్రీడలతో ఎంతో మేలు



మణికొండ: ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి రోజు ఓ గంట పాటు నచ్చిన ఆటలు ఆడుకుంటే ఆరోగ్యపరంగా, శారీరకంగా ఎంతో మేలు జరుగుతుందని టీవీనటి రోషిణి, ఐజేయు అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు శనివారం మెడల్‌లు, షీల్డ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీల్లో ఉన్న ఆట స్థలాలను వినియోగించుకుని ఇలాంటి పోటీలను నిర్వహిస్తే స్నేహసంబంధాలు మెరుగుపడటంతో పాటు మంచి వ్యాయామం అవుతుందన్నారు. రాబోయే రోజుల్లోను అన్ని రకాల క్రీడా పోటీలను నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు కె. రామయ్య తెలిపారు.

13న రక్తదాన శిబిరం

గోల్కొండ: ఈనెల 13న రక్తదానం నిర్వహిస్తున్నామని బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ తెలిపారు. శనివారం గుడిమల్కాపూర్ బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు, గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ స్మృతిలో ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. గుడిమల్కాపూర్‌లోని తాళ్లగడ్డ రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ రక్తదాన శిబిరం ఉంటుందని వారు తెలిపారు. జనహిత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ రక్తదాన శిబిరానికి ఎక్కువ సంఖ్యలో వచ్చి రక్తదానం చేయాలని వారు కోరారు.

గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో పెరిగిన ఔట్ పేషెంట్లు

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. సీజనల్ వ్యాధులతో బాధపడే వారు ఉదయం 8 గంటల నుంచే ఓపీ విభాగం వద్ద బారులుతీరుతున్నారు. దగ్గు, జ్వరంతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, అందువల్లే రికార్డు సంఖ్యలో రోగులు ఆస్పత్రికి వస్తున్నారని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా అన్నారు.

మణికొండలో ఎగ్జిబిషన్ ప్రారంభం

మణికొండ: దేశ వ్యాప్తంగా చేతి వృత్తుల వారు తయారు చేసిన దుస్తులు, గృహోపకరణ వస్తువుల ఎగ్జిబిషన్ మణికొండ పైప్‌లైన్ రోడ్డులో సుందర్ గార్డన్ ఫంక్షన్ హాల్ పక్కన శనివారం ప్రారంభమైంది. ఇందులో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైన ర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ లెనిన్, కలంకారి, బెంగాల్ కాటన్ చీరలతో పాటు డ్రస్ మెటీరియల్, డిజైనర్ బ్లౌస్‌లు, ఖాదీ మెటీరియల్, వన్ గ్రాం గోల్డ్ జ్యువలరీ, జైపూర్ బెడ్‌షీట్, కొండపల్లి బొమ్మలు, పర్సులు, గృహోపకరణ వస్తువులు అందుబాటులో ఉన్నాయి.





రోడ్లపై వ్యర్థ జలాలు..

మైలార్‌దేవ్‌పల్లి: పరిశ్రమలనుంచి వచ్చే వ్యర్థ జలాలను రోడ్లపై వదులుతూ ప్రజల ప్రాణాలతో నిర్వాహకులు చెలగాటమాడుతున్నారు. గగన్‌పహాడ్, కాటేదాన్, ఆనంద్‌నగర్, ఓల్డ్ కర్నూల్ రోడ్డులోని పలు పరిశ్రమల యజమానులు పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ జలాలను రోడ్లపైకి వదిలేస్తున్నారు. కలుషిత జలాలు ఇందిరాగాంధీ హౌజింగ్ సోసైటీకి వెళ్లే ప్రధాన రహదారిలో ప్రతినిత్యం 24 గంటలు కలుషిత జలాలు పారుతున్నాయి. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారినపడుతున్నారు. భూగర్భ జలాలు సైతం కలుషితమవుతూ చర్మ రోగాలతో పాటు పలు వ్యాధులు సోకుతూ ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లోని కార్మికులు ఆయా పరిశ్రమల్లో పని చేస్తూ జీవనం సాగిస్తుంటారు. స్థానికంగా నివసించే కార్మికులు తీవ్ర అనారోగ్యాలబారినపడుతున్నారు. కాలుష్య నీటిని వదులుతున్న పరిశ్రమలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: వెంకటేశ్వర స్వామి నామస్మరణతో ఉప్పర్‌పల్లి ప్రాంతం మార్మోగింది. రాజేంద్రనగర్ డివిజన్‌లోని ఉప్పర్‌పల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ దశమి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. దేవాలయ వ్యవస్థాపకులు, అలయ ధర్మకర్త సామ భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, విష్వక్సేన పూజ స్వామి వారికి అభిషేకం, నీరాజన మంత్రపుష్పం, బుత్విక్ వరణం, రక్షాబంధనం, అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణం, అర్చన, సహస్రనామార్చన, ఎదుర్కోలు ఉత్సవం, శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం, అన్నదానం, స్వామి వార్ల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని వివిధ రకాల పూలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి



హైదర్‌గూడ చౌరస్తాలో పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జాతీయ అధ్యక్షులు బీజేపీ సిద్ధాంతకర్త పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి కార్యక్రమాన్ని అత్తాపూర్ డివిజన్‌లోని హైదర్‌గూడలో శనివారం నిర్వహించారు. డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాబాద విజయ్‌కుమార్ అధ్యక్షత నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి హాజరయ్యారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్

రాజేంద్రనగర్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నట్లు అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ వెల్లడించారు. డివిజన్ పరిధిలోని హనుమాన్ కాలనీ రతన్‌నగర్‌లో ఇటీవల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. బస్తీ వాసులు సీసీ రోడ్డు కంటే ముందు నీటి ఎద్దడి సమస్య తీవ్రంగా ఉందని పాత పైపులైన్ చిన్నదిగా ఉండడంతో బస్తీలలో నుంచి తిరిగి వచ్చే సరికి మా వీధిలో ప్రెజర్ పూర్తిగా తగ్గిపోతుందని ఆమెకు వివరించారు. దీంతో ఆమె స్పందించి అధికారులతో చర్చించి సీసీ రోడ్డు పనులను నిలిపి వేయించి మొదట మంచినీటి పైపులైన్ వ్యవస్థను ఆధునీకరించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు శనివారం ఆమె పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పుడే నీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే రానున్న ఎండా కాలంలో సమస్య మరింత తీవ్రత కానుందన్నారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంచి నీటి పైపులైన్ పనులను చేపడుతున్నామన్నారు. ఈ పనులు పూర్తైన వెంటనే సీసీ రోడ్డు పనులను సైతం ప్రారంభించి కొత్త రోడ్డును వేస్తామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను తెలుసుకోని అందుకు అనుగుణంగా అభివృద్ధి పరుస్తున్నామన్నారు. ప్రజలకు ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పరిష్కరించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అత్తాపూర్ డివిజన్ ఉపాధ్యక్షురాలు సరితారెడ్డి, ఓబుల్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వీరారెడ్డి, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త

మణికొండ: దేశంలోని అనేక ప్రాంతాల నుంచి హైదరాబాద్ ప్రజలను సైబర్ నేరగాళ్లు టార్గెట్‌గా చేసుకుని ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలని రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ మహేష్, క్రైం ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్‌రెడ్డిలు అన్నారు. శనివారం సాయంత్రం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీలో వారు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుకున్న వారు సైతం ఇలాంటి సైబర్ నేరాల బారిన పడి ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఫోన్లకు వచ్చే ఆఫర్‌లు, ఫ్రీలు, ఉద్యోగాలు లాంటి మెసేజీలకు స్పందించటంతో వారి నుంచి డబ్బు లాగుతున్నారన్నారు. కార్యక్రమంలో చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వి. అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పీఎస్ఎన్ దొర, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు



దొంగల ముఠా అరెస్టు

శంషాబాద్ రూరల్: రాత్రి వేళ కారులో తిరుగుతూ ఆటో మొబైల్ దుకాణాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను శంషాబాద్ పోలీసులు పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కామాటిపురకు చెందిన గౌస్‌ఖాన్, చంద్రాయణగుట్ట నివాసి మహ్మద్ ఫరాజ్ అహ్మద్ అలియాస్ మహ్మద్ అలీ అహ్మద్, అత్తాపూర్ ప్రాంతానికి చెందిన ఖాజా మొయినుద్దీన్ అలియాజ్ షేక్ సోహిల్, మహ్మద్ అర్బాజ్‌ఖాన్, రాజేంద్రనగర్ వాసి సయ్యద్ సమైర్ ఓ ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. గండిగూడలో ఉన్న ఆటోనగర్‌లో వరస దొంగతనాలు జరుగుతుండడంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిఘా పెట్టారు. ఈ ముఠా సభ్యులు శనివారం తెల్లవారుజామున ఆటోనగర్‌లో రెండు కార్లలో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. అదుపులోకి తీసుకుని విచారించారు. ఆటోనగర్‌లోని ఆటోమొబైల్ దుకాణాల్లో రాత్రి వేళల్లో షెటరు తాళాలు విరగ్గొట్టి దొంగతనానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. వీరు దొంగిలించిన వస్తువులను పోలీసులు రికవరీ చేయడంతో పాటు రెండు కార్లను సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు పంపారు.

శ్రీరామనగరంలో గీతా పారాయణం

శంషాబాద్ రూరల్: గీతా పారాయణతో శ్రీరామ నగరం మార్మోగింది. సమతా కుంభ్ ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో విశ్వశాంతి విరాట్ గీతా పారాయణ చేశారు. అంతకుముందు ఉత్సవ మూర్తుల రథోత్సవం, విరజా పుష్కరిణిలో చక్ర స్నానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



పార్కు స్థలంలో నిర్మాణాలను కూల్చి వేసిన అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఇందిరా గాంధీ హౌజింగ్ సోసైటీలో 1500 గజాల పార్కు స్థలంతో పాటు మరో రెండు ప్లాట్లలో కొందరు కబ్జాకు పాల్పడుతూ నిర్మాణాలు చేపట్టారు. దీంతో స్థానికులు, బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇతరులకు చెందిన స్థలంపై నకిలీ దస్తావేజులు సృష్టించి ఈ ప్లాట్లు తమకు చెందినవే అంటూ కబ్జా యత్నంలో ఉన్నారు. భూకబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇందిరాగాంధీ హౌజింగ్ సోసైటీ ప్లాట్ల యజమానులు అధికారులను కోరుతున్నారు.

సీబీఐటీలో ఈ స్పోర్ట్స్ క్లబ్ ప్రారంభం

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)లో ఈ స్పోర్ట్స్ క్లబ్‌ను శనివారం ప్రారంభించారు. తెలుగు టెక్కీ, పాపులర్ యూట్యూబర్ ప్రసాద్ దేవరకొండ దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్పోర్ట్స్ వీడియో గేమ్‌లు మంచి పోటీ వాతావరణాన్ని సృష్టిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఈ స్పోర్ట్స్ క్లబ్‌ను ప్రారంభించిన ప్రసాద్

రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలి



లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు

రాజేంద్రనగర్: రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని రాజేంద్రనగర్ మండల న్యాయ సేవాధికార సంఘం చైర్మన్, 11వ అదనపు న్యాయమూర్తి సుచరిత పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో మొత్తం 17,270 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో 13వ అదనపు న్యాయమూర్తి రుబీన ఫాతిమా, స్పెషల్ కోర్టు న్యాయమూర్తులు రానోజి, నజీరుద్దీన్, డిసిపి జగదీశ్వర్‌రెడ్డి, ఏసీపీ గంగాధర్, ఏపీపీలు శీనయ్య, ప్రవీణ్, సంగీత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం



కీడలను ప్రారంబిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

ఏజీవర్సిటీ: సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర అతి ముఖ్యమైనదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం గ్రౌండ్‌లో రాజేంద్రనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ప్రింట్‌మీడియా వర్సెస్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్‌లు తలపడిన ఈ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించగా సాయంత్రం డీసీపీ జగదీశ్వర్ రెడ్డి గెలుపొందిన టీమ్‌లకు షీల్డ్‌లు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు ప్రతి ఒక్కరి మధ్యా స్నేహసంబంధాలు మెరుగు పరుస్తాయన్నారు.

మాట్లాడుతున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి



పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



మాట్లాడుతున్న సినీనటుడు శివారెడ్డి

మణికొండ: ప్రతి ఇంటి మాదిరిగానే ప్రతి వీధి, ప్రతి కాలనీ పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా జీవిస్తారని, పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాల్సిన అవసరం ఎంతో ఉందని మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె.నరేందర్ ముదిరాజ్, వైస్ చైర్మెన్ కె.నరేందర్‌రెడ్డి, సినీనటుడు శివారెడ్డిలు అన్నారు. శనివారం మున్సిపాలిటీ కేంద్రం మణికొండ మర్రిచెట్టు వద్ద స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాలీని చైర్మెన్ ప్రారంభించారు. మర్రిచెట్టు నుంచి పంచవటి కాలనీ వరకు స్వచ్ఛ నినాదాలతో జరిగిన స్వచ్ఛతా ర్యాలీలో వందలాది మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయటంతో అనేక రోగాలు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. మున్సిపల్ కమీషనర్ ఫల్గుణ్‌కుమార్, మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీనటుడు శివారెడ్డి చేసిన మిమిక్రీ అందరినీ అలరించింది.

రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రామచందర్‌రావు



కార్యక్రమంలో పాల్గొన్న కిస్మత్‌పూర్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు

బండ్లగూడ: తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు అందరు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కిస్మత్‌పూర్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు జి.రామచందర్ రావు అన్నారు. శనివారం కిస్మత్‌పూర్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సభ్యుల సమక్షంలో ఎన్నుకున్నారు. పాత కమిటీని రద్దు చేస్తూ సభ్యులు ఆమోదంతో కొత్త కమిటిని ఎన్నుకున్నారు. కిస్మత్‌పూర్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులుగా జి.రామచందర్‌రావు, ఉపాధ్యక్షులుగా ఏ.రామ్‌చందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.విఠలయ్య, ఉప కార్యదర్శిగా ఎం.భగవాన్‌దాసు, ఆర్గనైజ్ కార్యదర్శిగా ఎస్.స్వామి, కోశాధికారిగా సి.హెచ్.మధుసుధన్‌రావు, ఉప కోశాధికారిగా కె.సత్తయ్య, కమిటి సభ్యులుగా ఏ.నారాయణరెడ్డి, కె.అంతయ్య, డి.అంజయ్యగౌడ్, ఏ.కేశవరెడ్డి, ఎం.దశరథ్, సలహాదారులుగా ఎం.పెద్ద కృష్ణ, టి.పాండు, బి.పాపయ్య, జి.గోపాల్‌రావు, డి.మల్లేష్ తదితరులు నియమితులైయ్యారు.

నెక్నాంపూర్ కౌన్సిలర్ సస్పెన్షన్ నిలిపివేత

హైకోర్టు మధ్యంతర ఉత్వర్వులు



నెక్నాంపూర్ కౌన్సిలర్ పద్మారావు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ 7వ వార్డు నెక్నాంపూర్ కౌన్సిలర్ బి.పద్మారావు సస్పెన్షన్‌ను హైకోర్టు నిలిపివేసింది. అతని వార్డు పరిధిలో సంతోష్‌రెడ్డి అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతుండగా కౌన్సిలర్ పద్మారావు అతన్ని డబ్బులు డిమాండ్ చేయటంతో అతను నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.కౌన్సిలర్‌పై కేసు నమోదు కావటంతో జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసు జారీ చేసి సంజాయిషీ అడగటం, దానికి సంతృప్తి చెందకపోవటంతో గత నెల అప్పటి కలెక్టర్ సస్పెండ్ చేసిన విషయం విదితమే. దాంతో అతను హైకోర్టును ఆశ్రయించి తనపై అనవసరం ఆరోపణలు చేయటంతో పాటు పోలీసు కేసు నమోదు చేయించారని, తాను ఎవరి వద్ద డబ్బులు డిమాండ్ చేయలేదని హైకోర్టును ఆశ్రయించారు. దాంతోహైకోర్టు విచారణ చేపట్టి అతని సస్పెన్షన్‌ను నిలిపివేస్తు మధ్యంతర ఉత్వర్వులు జారీ చేసింది. ఈ విషయంలో కౌంటర్ దాఖలు చేయాలని, సంతోష్‌రెడ్డిని ప్రతివాదిగా చేర్చాలని ఉత్వర్వుల్లో పేర్కొంది. విచారణను మార్చి 14వ తేదీకి వాయిదా వేసిందని పద్మారావు తెలిపారు.

ప్రజా సేవలోనే సంతృప్తి: ఎమ్మెల్యే కౌసర్



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సేవలోనే సంతృప్తి పొందుతున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఉదయం కార్వాన్, జియాగూడ, టోలిచౌకి డివిజన్ల నుంచి పలువురు ఆయనను కలవడానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నా కూడా తాను ప్రజా సమస్యలు వినడానికి ప్రాధాన్యం ఇస్తున్నానన్నారు. అసెంబ్లీ విరామ సమయంలో తనకు వచ్చిన ఫిర్యాదుల గురించి సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరింపజేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా కార్వాన్ నియోజకవర్గ మజ్లిస్ కార్పొరేటర్లు, మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధుల ద్వారా వారి వారి ప్రాంతాల సమస్యలను వింటున్నానని ఆయన అన్నారు. కార్వాన్ నియోజకవర్గంలోని చారిత్రక ప్రదేశాలు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రశ్నలులేవనెత్తానన్నారు. తాను లేవనెత్తిన సమస్యలపై రాష్ట్రల మంత్రులు సానుకూలంగా స్పందించారన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగియగానే ఆయ శాఖల మంత్రులను అసెంబ్లీ సాక్షిగా అడిగిన ప్రశ్నల విషయంపై వారికి గుర్తుచేసి నిధులు కేటాయించేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు అలీమొద్దీన్, జబ్బార్ తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా వీనస్ హైస్కూల్ క్రీడోత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న అంతర్జాతీయ కరాటే చాంపియన్ సయ్యదా ఫలక్

గోల్కొండ: టీనేజీ అమ్మాయిలు జాతీయ, అంతర్జాతీయ క్రీడా వేదికలపై విశేషంగా రాణిస్తున్నారని కరాటే చాంపియన్ సయ్యదా ఫలక్ అన్నారు. శనివారం టోలిచౌకి వీనస్ హైస్కూల్ వార్షిక క్రీడోత్సవాలు పర్వాద్-2022, 23 ఫాతిమా గ్రౌండ్‌లో జరిగాయి. ఆమె ప్రత్యేక అతిథిగా హాజరై వివిధ క్రీడా పోటీల్లోని విజేతలకు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. అమ్మాయిలు ఇష్టపడే క్రీడాంశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన శిక్షకులచే శిక్షణ తీసుకున్నామని వీనస్ విద్యాసంస్థల కరెస్పాండెంట్ మహ్మద్ హిదాయత్‌అలీఖాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్, సకీనా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఆసిఫ్ హుస్సేన్, అల్తాఫ్ హుస్సేన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ మీర్ జవార్‌ఖాన్ తదితరులు ఉన్నారు.